AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

WWW.AKSHARATODAYNEWS.COM

29-6-2026 (Monday) MAIN EDITION

## సీఎం మధిర రైతు సభ రద్దు..



**అక్షరటుడే, హైదరాబాద్:** రాష్ట్రంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఖమ్మం జిల్లా మధిరలో మంగళవారం జరగాల్సిన 'రైతు ఆశీర్వాద సభ'ను ప్రభుత్వం రద్దు చేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఈ కార్యక్రమానికి హాజరుకావాల్సి ఉండగా, ప్రతికూల వాతావరణ పరిస్థితుల దృష్ట్యా వేదికను హైదరాబాద్‌కు మారుస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. మధిర సభకు బదులుగా, హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో మంగళవారం సాయంత్రం 4 గంటలకు 'రైతు భరోసా పంపిణీ సదస్సు'ను నిర్వహించాలని సీఎం నిర్ణయించారు.

## సీఎంకు మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి కౌంటర్




**అక్షరటుడే, హైదరాబాద్ :** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగ దీశ్‌రెడ్డి కౌంటర్ ఇచ్చారు. సంస్కారం, సబ్జెక్ట్ లేనివాళ్లే ఎత్తు గురించి మాట్లాడతారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం నల్గొండ సభలో జగదీశ్‌రెడ్డిపై వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. ఆయన వ్యాఖ్యలకు తాజాగా జగదీశ్‌రెడ్డి కౌంటర్ ఇచ్చారు. మనుషుల ఎత్తులు, పొడుగుల గురించి.. సబ్జెక్ట్ లేనివాడు, సంస్కారం లేని వాడు మాత్రమే మాట్లాడతారని విమర్శించారు.

## సీషెల్స్‌లో ప్రధాని పూజలు



అక్షరటుడే, నేషనల్ డెస్క్: సీషెల్స్ రాజధాని విక్టోరియాలోని చారిత్రాత్మక 'అరుల్ మిహు నవశక్తి వినాయగర్' ఆలయాన్ని ప్రధాని మోదీ సందర్శించారు. 1992లో నిర్మితమైన ఈ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు, సీషెల్స్ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా భారత ఆర్మీ, నేవీ దళాలు నిర్వహించిన పరేడ్ విశేషంగా నిలిచింది.

## రాజ్యసభ ప్రతిపక్ష నేతగా మళ్లీ ఖర్గే



అక్షరటుడే, ఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మరోసారి రాజ్య సభ ప్రతిపక్ష నేతగా అధికారిక గుర్తింపు పొందారు. ఇటీవల ఆయన ఎగువ సభకు తిరిగి ఎన్నికైన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాజ్యసభ చైర్మన్ సీపీ రాధాకృష్ణన్ సమక్షంలో ఆయన ఎంపీగా ప్రమాణ స్వీకారం చేశారు.

## 'ఈ నగరానికి ఏమైంది' సీక్వెల్ రిలీజ్ డేట్




అక్షరటుడే, సినిమాడెస్క్: టాలీవుడ్ యూత్‌ఫుల్ కల్ట్ క్లాసిక్ హిట్టయిన 'ఈ నగరానికి ఏమైంది' సినిమా మోస్ట్ అవేటెడ్ సీక్వెల్ వచ్చేస్తోంది. ఈఎన్ఈ రిపీట్ పేరుతో వస్తున్న ఈ సీక్వెల్ రిలీజ్ డేట్ ను మేకర్స్ ఇవాళ అనౌన్స్ చేశారు. నవంబర్ 19న రిలీజ్ చేయనున్నారు. ఈ అనౌన్స్ మెంట్ వీడియో సోషల్ మీడియాలో మోత మోగిస్తోంది.


## వెనిజులా భూకంపం..

### ఫుట్‌బాల్ క్రీడాకారుడి కుటుంబం దుర్మరణం



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** వెనిజులాలో వరుసగా సంభవించిన భూకంపాలు దేశాన్ని అతలాకుతలం చేశాయి. శిథిలాల కింద చిక్కుకున్న వారి కోసం ఐదు రోజులుగా రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతోంది. ఈ విపత్తులో అర్జెంటీనాకు చెందిన ప్రముఖ ఫుట్ బాల్ క్రీడాకారుడు లూకాస్ ట్రెజో (38) తన కుటుంబాన్ని కోల్పోయి అనాథగా మిగిలారు. భూకంపం సంభవించిన సమయంలో ఆయన కరాకస్‌లోని కోచింగ్ సెంటర్‌లో ఉండగా, ఆయన నివాసం ఉంటున్న లా గుయైరాలోని ఇల్లు పూర్తిగా కుప్పకూలిపోయింది. విషయం తెలిసిన వెంటనే ట్రెజో అక్కడకు చేరుకున్నారు. ఆదివారం రోజు తన కుటుంబ సభ్యుల మృతదేహాలను చూసి ఆయన శోకసంద్రంలో మునిగిపోయారు.

## ఎస్ ఐఆర్ భయంతో డ్రైవర్ ఆత్మహత్య



**అక్షరటుడే, హైదరాబాద్ :** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియ ఓటరు జాబితాలో తన పేరు లేదని, దానివల్ల ప్రభుత్వం తనను జైలుకు పంపిస్తుందేమోనని భయపడి ఒక వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నగరంలోని బోరబండ ప్రాంతంలో వెలుగుచూసింది. షేక్ ముజీబుర్ రహ్మాన్ (51) కార్ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఆయనకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. కొంతకాలంగా తన పాస్‌పోర్ట్, ఇతర డాక్యుమెంట్లలో పేరు తప్పుగా ఉండటంతో, వాటిని సరిచేయించుకోవడానికి ముజీబుర్ లక్షల రూపాయలు ఖర్చు చేశారని, ఈ క్రమంలో, తాజా ఎస్ఐఆర్ ఓటరు జాబితాలో తన పేరు లేకపోవడం, తన దగ్గర ఉన్న పత్రాలు ఆ జాబితాతో సరిపోలకపోవడం చూసి ఆయన తీవ్ర ఆందోళనకు గురయ్యారని కుటుంబ సభ్యులు తెలిపారు.



మూసీ నది ప్రక్షాళనను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న విషయం తెలిసిందే. ఎవరు అడ్డు వచ్చినా ఈ ప్రాజెక్ట్ ను పూర్తి చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి గతంలో ప్రకటించారు. ఈ మేరకు ప్రభుత్వం మూసీ సుందరీకరణ దిశగా వేగంగా అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా గాంధీ సరోవర్ ప్రాజెక్ట్‌కు ఇప్పటికే కేంద్ర రక్షణ శాఖ అనుమతి లభించింది. అయితే ఈ ప్రాజెక్ట్‌తో నదికి ఇరువైపులా ఉన్నవారు ఇళ్లు కోల్పోనున్నారు. వారికి రాష్ట్ర ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. ఇళ్లు కోల్పోయే వారికి డబుల్ బెడ్ రూం ఇళ్లు అందిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు.

– అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి

# 'మూసీ' బాధితులకు డబుల్ ఇళ్లు

- ఈ ప్రాజెక్ట్ తెలంగాణ భవిష్యత్తుకు బలమైన పునాది
- మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి
- భూ సేకరణ, పునరావాసంపై సమీక్ష

మూసీ పునరుజ్జీవ ప్రాజెక్ట్ తెలంగాణ భవిష్యత్తు అభివృద్ధికి, హైదరాబాద్ నగర రూపురేఖలను మార్చే చారిత్రాత్మక ప్రాజెక్ట్‌గా నిలుస్తుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. ఈ ప్రాజెక్టుకు అవసరమైన భూ సేకరణ, పునరావాసం తదితర అంశాలపై సచివాలయంలోని తన ఛాంబర్‌లో మంత్రి సోమవారం ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో మూసీ నదిని పునరుజ్జీవింపజేసి, దాన్ని పర్యాటకం, ఉపాధి, ఆర్థికాభివృద్ధికి కేంద్రంగా మార్చాలన్నది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉద్దేశం అన్నారు.

### కాలుష్యానికి చెక్

మూసీ నది కాలుష్యంతో ఎన్నో దశాబ్దాలుగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని మంత్రి గుర్తు చేశారు. వరదల సమయంలో పరీవాహక ప్రాంతాల ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలను దృష్టిలో ఉంచుకొని ఈ ప్రాజెక్ట్‌కు సీఎం శ్రీకారం చుట్టారన్నారు. వరద నియంత్రణ, నీటి శుద్ధి, పచ్చదనం పెంపు, రోడ్లు, పార్కులు, వాక్‌వేలు, వినోద కేంద్రాలు ఏర్పాటు ద్వారా మూసీ పరీవాహక ప్రాంతాలను అభివృద్ధి చేస్తామని తెలిపారు.

### ఎవరికి వ్యతిరేకం కాదు

మూసీ ప్రాజెక్ట్ ఎవరికీ వ్యతిరేకం కాదని, ఎవరికీ అన్యాయం జరగకుండా ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి హామీ ఇచ్చారు. అభివృద్ధి కార్యక్రమాల పేరుతో పేదల జీవితాలు దెబ్బతినకుండా మానవీయ కోణంలో నిర్ణయాలు తీసుకుంటామన్నారు. ఇళ్లు కోల్పోయే కుటుంబాలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలని, ఇందుకు అవసరమైన కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. భూములు కోల్పోయే వారికి చట్టబద్ధమైన పరిహారం, అవసరమైన పునరావాసం కల్పించడంలో ప్రభుత్వం రాజీ పడబోదని స్పష్టం చేశారు.

## ఈసీపై కవిత సంచలన ఆరోపణలు




**అక్షరటుడే, హైదరాబాద్:** రాష్ట్రంలో జరుగుతున్న ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో అక్రమాలు జరుగుతున్నాయని, దీనిపై ఎన్నికల సంఘం వెంటనే స్పష్టత ఇవ్వాలని కవిత డిమాండ్ చేశారు. పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రాతి నిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గం, బోధన్ నియోజకవర్గాల్లో ఓట్ల తొలగింపు, చేర్పులపై ఆమె పలు సంచలన విషయాలను ప్రస్తావించారు. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు కొడంగల్ నియోజకవర్గంలో దాదాపు 30 వేల డూప్లికేట్ ఓట్లు ఉండేవని, అందులో పొరుగున ఉన్న కర్ణాటకలోని సెడం నియోజకవర్గం నుండి సుమారు 11 వేల మంది ఓటర్లుగా నమోదు చేసుకున్నారని ఆమె ఆరోపించారు. సీఎం గెలుపు మార్జిన్, ఆ డూప్లికేట్ ఓట్ల సంఖ్య దాదాపు సమానంగా ఉండటం గమనార్హమని, ఈసీ ఆయనకు ఏమైనా ఫేవర్ చేసిందా అన్న అనుమానం కలుగుతోందని ఆమె పేర్కొన్నారు. ఈ ఏడాదిన్నర కాలంలో బోధన్ నియోజకవర్గంలో 7 వేల ఓట్లు తొలగించగా, సీఎం నియోజకవర్గం కొడంగల్‌లో మాత్రం కేవలం 808 ఓట్లు మాత్రమే తొలగించడంపై కవిత మండిపడ్డారు. బోధన్‌లో తొలగించిన ఆ 7 వేల మంది ఏమయ్యారు? వారు మరణించారా లేక వలస వెళ్లారా అన్న వివరాలు ఈసీ చెప్పడం లేదని ఆమె విమర్శించారు.

## ఒక్క ఓటు కూడా పోవద్దు..: పొన్నం



**అక్షరటుడే, సిద్దిపేట :** ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా అర్హత ఉన్న ఒక్క ఓటు కూడా పోకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బీఎల్‌వోలు ఇచ్చే ఎన్యుమరేషన్ ఫారాలను ప్రతి ఒక్కరూ నింపాలని సూచిం చారు. మంత్రి పొన్నం సోమ వారం హుస్నాబాద్ నియోజకవర్గంలోని కోహెడలో పర్యటించారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఎల్‌వోలు ఇచ్చే ఎన్యుమరేషన్ ఫారాలు నింపి, ఓటరు జాబితాలో ఓటు గల్లంతు కాకుండా చూసుకోవాలన్నారు. బీఎల్‌వోలు, బీఎల్ఏలు ఓటరు సవరణపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఫారాలను ఎలా నింపాలో వివరించాలన్నారు.

## అయోధ్య విరాళాల కేసు.. అత్యవసర విచారణకు నిరాకరించిన సుప్రీం




**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** అయోధ్య విరాళాల దుర్వినియోగంపై దాఖలైన పిటిషన్‌పై తక్షణ విచారణకు సుప్రీంకోర్టు నిరాకరించింది. కేసును అత్యవసరంగా విచారించాల్సిన పరిస్థితి లేదని ధర్మాసనం పేర్కొంది. అయోధ్యలోని రామమందిరం కోసం 'శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్'కు అందిన విరాళాల దుర్వినియోగంపై దర్యాప్తు చేయడానికి ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై అత్యవసర విచారణ జరపడానికి సుప్రీంకోర్టు సోమవారం నిరాకరించింది. పిటిషనర్ స్వయంగా కోర్టుకు హాజరై ఈ కేసును అత్యవసర విచారణ జాబితాలో చేర్చాలని కోరగా, జస్టిస్ ఎం.ఎం. సుందరేష్, జస్టిస్ షీల్ నాగులతో కూడిన ధర్మాసనం, కోర్టు తిరిగి తెరుచుకున్న తర్వాత ఈ అంశాన్ని విచారణకు చేపట్టాలని ఆదేశించింది.

## బస్సు బోల్తా.. 10 మందికి గాయాలు




**అక్షరటుడే, మహబూబ్ నగర్:** వనపర్తి జిల్లా పెబ్బేరు సమీపంలో, ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయిన క్రమంలో అదుపు తప్పిన ఆర్టీసీ బస్సు బోల్తా పడింది. ఈ ఘటనలో 10 మంది ప్రయాణికులు గాయపడ్డారు. మంత్రాలయం నుంచి వనపర్తికి వెళ్తున్న బస్సు పెబ్బేరు సమీపంలో సోమవారం ఉదయం ప్రమాదానికి గురైంది. ఆ సమయంలో బస్సులో 30 మంది ప్రయాణికులు ఉన్నారు. స్థానికులు, పోలీసులు వెంటనే స్పందించి క్షతగాత్రులను పెబ్బేరు ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదం కారణంగా ఆ మార్గంలో కాసేపు ట్రాఫిక్ నిలిచిపోయింది.

## గంజాయి సాగును అరికట్టాం : ఏపీ హోం మంత్రి



**అక్షరటుడే, ఏపీ:** డ్రగ్స్ రహిత ఏపీ కోసం అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని హోంమంత్రి వంగలపూడి అనిత పిలుపునిచ్చారు. గంజాయి సాగును సున్నాకు చేర్చడం వల్లే రాష్ట్రంలో నేరాల రేటు 14 శాతం తగ్గిందన్నారు. హోం మంత్రి అనిత సోమవారం మీడియాతో మాట్లాడారు. 'ఈగల్' టాస్క్‌ఫోర్స్ ద్వారా 1.20 లక్షల కేజీల గంజాయిని ధ్వంసం చేశామని, స్మగ్లర్ల రూ. 24 కోట్ల ఆస్తులను జప్తు చేశామని తెలిపారు. గంజాయి మూలాలను అరికట్టే యత్నం చేస్తున్నామన్నారు. మాదకద్రవ్యాల నుంచి బయట పడాలంటే ప్రజల సహకారం అవసరం అన్నారు. ఈ బాధ్యతను అందరం భుజాలపై వేసుకొని ముందుకు సాగాలని సూచించారు.

## యూట్యూబ్ చూసి ఇంట్లోనే ప్రసవం.. నిండు ప్రాణం బలి



**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** యూట్యూబ్ వీడియోలు చూసి ఇంట్లోనే కాన్పు చేసుకునేందుకు ప్రయత్నించిన ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ చివరకు ప్రాణాలు కోల్పోయిన ఘటన తమిళనాడులోని తిరుప్పూర్ జిల్లాలో వెలుగుచూసింది. ఉతుకులి సమీపంలోని పుంజై తలవాయిపాళ్యానికి చెందిన శశికళ (32) అనే సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ రెండోసారి గర్భం దాల్చారు. గతంలో సిజేరియన్ ద్వారా ప్రసవం జరిగినప్పుడు తీవ్ర ఆరోగ్య సమస్యలు ఎదురవడంతో, ఈసారి ఎలాగైనా 'నార్మల్ డెలివరీ' అవ్వాలని ఆమె మొండిగా నిర్ణయించుకున్నారు. కుటుంబ సభ్యులు ఎన్నిసార్లు ఆస్పత్రికి వెళ్లమని చెప్పినా వినకుండా, యూట్యూబ్ వీడియోల ఆధారంగా ఇంట్లోనే ప్రసవం చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. జూన్ 24న తెల్లవారు జామున శశికళకు పురిటి నొప్పులు రావడంతో, యూట్యూబ్ సూచనలను పాటిస్తూ అత్త సహాయంతో ఇంట్లోనే ఆమె ఆడబిడ్డకు జన్మనిచ్చారు. అయితే, ప్రసవం జరిగిన కొద్ది సేపటికే శశికళకు విపరీతమైన రక్తస్రావం మొదలైంది. దీంతో ఆమెను ఆస్పత్రికి తరలించి ఐసీయూలో ఉంచి చికిత్స అందించారు. చికిత్స పొందుతూ జూన్ 28న మృతి చెందింది.